# భస్మాసురుడు

కానిస్టేబుల్ కాంతారావుకు విజయనగరం ట్రాన్స్ఫరై ఆరు నెలలవుతోంది. ఆ రోజు నైట్ డ్యూటీ పడటంతో హడావిడిగా నాలుగు మెతుకులు కతికి యూనిఫారం వేసుకున్నాడు.

"అబ్బాయి రాత్రి ట్రైనుకు ప్రయాణం పెట్టుకున్నాడు కదా....డ్యూటీ మార్పించుకోలేక పోయారా" చిరాగ్గా ముఖం చిట్లిస్తూ అన్నది వెంకటలక్ష్మి.

"ఏం చేయమంటావ్ ఆరు న్నూరైనా డ్యూటీ మార్చేది లేదని యస్.ఐ గారు చెప్పేసారు. మనం మరీ అంత కంగారు పడిపోడానికి వాడేమైనా పసివాడా? జాగ్రత్తగా వెళ్ళి రమ్మని చెప్పు" పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ బయట పడ్డాడు కాంతారావు.

కాంతారావు గంట స్తంభం నుండి నెహ్రూ పార్కు వరకు ముమ్మాలు తిరిగి బీడీ అంటించుకున్నాడు.

అప్పుడే న్యూపూర్ణా ఇంటర్వెల్ ఇవ్వడంతో జనం థియేటర్లోంచి గుంపులు గుంపులుగా బయటకు వచ్చి టీ దుకాణాల దగ్గర చేరారు. కొందరు కిళ్ళీ బడ్డీల వద్ద నిలబడి సిగరెట్లు కాలుస్తున్నారు.

ఉన్నట్లుండి కాంతారావు దృష్టి అక్కడ టీ తాగుతన్న వ్యక్తి మీద పడ్డాది. అంతే, 'రేయ్ పోలయ్యా!' బిగ్గరగా కేక పెట్టాడు.

కాంతారావు పిలుపుకి, "నమస్కారం సార్" చేతులు జోడిస్తూ దగ్గరకొచ్చాడు పోలయ్య.

"ఈవేళప్పుడు ఇక్కడ ఉన్నావేట్రా?!"

"రెండో ఆట సిన్మాకొచ్చాను బాబు"

"సినిమాకా?.....జేబులు కొట్టడానికా? నీ దొంగ యాసాలు నా దగ్గరట్రా......" యగతాళి ధ్వనిస్తోందతని కంఠంలో.

"దొంగతనాలు మానేసి సేన్నాళ్లైంది బాబయ్యా! ఇప్పుడు కాయకట్టం సేసుకుని బతుకుతున్నా".

"కేడీ నా కొడకా, బుద్ధిమంతుడిలా మాట్లాడకు, బూటు కాలుతో తన్నగలను జాగ్రత్త. నాకిప్పుడు వంద రూపాయలు కావాలి. ఎక్కడ నుండి పుట్టిస్తావో ఏమో! తెల్లవారే వరకు నేనిక్కడే వుంటాను.... వెళ్ళు..." అధికార దర్పాలు అతడిలో మూర్తీభవించి వున్నాయియా క్షణంలో.

"చమించండి బాబు. మీ కాళ్ళట్టుకుంటాను. నానా పని ఇప్పుడు పూర్తిగా ఒగ్గేసినాను. మళ్లీ ఆ రొచ్చులోకి దింపకండి మీకు వున్యముంటాది" బ్రతిమాలాడుతున్నాడు పోలయ్య.

"నువ్వింతగా చెబుతున్నావు గనుక నిన్ను మరి ఒత్తిడి చేయదలచుకోలేదు. నాకు ఇప్పుడు డబ్బు అవసరం. ఈ ఒక్కమారు సాయం చెయ్యి. మరి నీజోలికి రాను. నీకు తెలుసునో తెలియదో పాత కేడీల్ని బొక్కలో తోసేయమని ఆర్డర్సున్నాయి. తలచుకుంటే నిన్నీక్షణంలో జైల్లోకి గెంటేయగలను" బెదిరించాడు కాంతారావు, లాఠీ కఱ్ఱ ఊపుతూ.

భయంతో వణికిపోయాడు పోలయ్య. ఐతే జైలుకు వెళ్ళవలసి వస్తుందని కాదు. మళ్లీ దొంగతనాలు చేస్తున్నట్లు లచ్చి అనుకుంటుందేమోనని. ఈ గండం నుండి బయటపడాలంటే పోలీసు చెప్పినట్లు చేయక తప్పదనుకున్నాడు.

● ● ●

పోలయ్య పార్వతీపురంలో వుండేటప్పుడు జేబులు కట్ చేసేవాడు. పట్టుబడితే కొన్నాళ్ళు కొట్లో కాపురం చేసి బయటకొచ్చే వాడు. వాడి భార్య లచ్చికా పని ఇష్టం వుండేది కాదు. అతడి చేత దొంగతనం మాన్పించడానికి విశ్వ ప్రయత్నం చేసి విఫలమయింది.

ఒకమారు పోలయ్యకి నక్సలైట్లతో సంబంధం వుందన్న అనుమానంతో రాజమండ్రి సెంట్రల్ జైల్లోకి నెట్టేసారు.

సంవత్సరం తర్వాత విడుదలై ఇంటికి వచ్చిన భర్తను పట్టుకుని "మావా" అంటూ భోరున ఏడ్చింది లచ్చి. ఆమె ఏడుస్తూ వుంటే పోలయ్యకు కూడ దుఃఖం

వచ్చింది.

"నీ కాళ్లట్టుకుంటాను. ఇక మీదట్నైనా దొంగతనాలు మానేయ్ మావా. నువ్వునేకపోతే నాను బతకలేను" గోలపెట్టింది లచ్చి.

భార్య నెలా సముదాయించాలో తెలియలేదు పోలయ్యకు. ఆమెను దగ్గరకు తీసుకుని కళ్ళు వత్తుతూ "నాకూ అట్టాగే అనిపిస్తోంది లచ్చీ. దొంగతనాలొగ్గేసి దరజాగా బతకాలని నాకు మాత్రం ఉండదా సెప్పు. నానేమో సదూకోనేదు. ఎట్టా బతకాలో తెల్వక ఈకేడీ పన్లు" ప్రకటించాడు పోలయ్య.

"ఈ పెపంచంలో సదూకూనోళ్లే కాదు మావా సదూలేనోళ్లు కూడ హాయిగా బతుకుతున్నారని నీకు తెలీదా? మనం ఎంటనే ఇజన్నారం ఎల్లిపోదాం. అక్కడ మా బావ కాపీ కొట్టు ఎట్టిండు. నాను సెబితే నీకేదైనా సిన్నపని ఈయక పోడు. పోలీసోళ్ళచేత చావు దెబ్బలు తింటూ ఈడ ఉండే కంటేమరో సోటికి పోయి గంజినీళ్లు తాగడం మేలు మావా" బ్రతిమలాడింది లచ్చి. ఆమె కళ్ళంట ఏకధారగా నీళ్ళు కారుతున్నాయి.

లచ్చి మాటకు మరి బదులు చెప్పలేదు పోలయ్య. మరుక్షణం మూటా ముళ్ళు సర్దుకున్నారా దంపతులు.

• • •

పోలయ్య వందరూపాయలు తెచ్చివ్వడంతో రాత్రంతా డ్యూటీ చేసినా ఢీలా పడిపోలేదు కాంతారావు. పైగా చలాకీగా కనిపిస్తున్నాడు. ఇప్పుడతడి ముఖం వెయ్యి వోల్టుల విద్యుత్ బల్బులా వెలిగిపోతోంది. హుషారుగా ఈల వేసుకుంటూ ఇల్లు చేరుకున్నాడు కాంతారావు.

ఇంట్లో అడుగుపెడుతూనే వాకిట్లో మంచం మీద దుప్పటి కప్పుకుని పడుకున్న కొడుకును చూసి ఆశ్చర్యపోతూ "ఏం లక్ష్మి, అబ్బాయి రాత్రి ఊరికెళ్ళలేదా?" అడిగాడు కాంతారావు.

"వెళ్ళడం రావడం రెండూ అయ్యాయి."

"రాత్రి స్టేషనుకు వెళ్లేటప్పుడు ఎవడో దొంగ వెధవ పరుసు కొట్టేసాడంట. డబ్బు పోవడంతో వెర్రి మొహం పెట్టుకుని ఇంటి కొచ్చేశాడు."

భార్య మాటలకు విద్యుద్ఘాతం తగిలి నట్లైంది కాంతారావుకి. "వెధవ నా

డబ్బు కొట్టేసి నాకే ఇచ్చాడన్న మాట" అనుకుంటూ పళ్ళు నూరాడు.

వెంకటలక్ష్మి ఇంకా ఏదో చెబుతోంది. ఆ మాటలేవీ అతడి కర్ణభేరికి చేరడం లేదు. కొడుకు ఇంటర్వ్యూకి వెళ్ళలేక పోవడానికి తనే కారకుడని తెలిస్తే అబ్బాయి తనని క్షమిస్తాడా?

వెంకటలక్ష్మి ఏమంటుంది? అన్న ప్రశ్నలే అతడి మస్తిష్కంలో సుళ్ళు తిరుగుతున్నాయి.

● *ఆంధ్రజ్యోతి ఆదివారం, 6–11–88* ●